హనుమాన్ ఆలయంలో జైళ్లశాఖ డీజీ పూజలు


డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రాకు స్వామివారి ఆశీర్వచనాలు అందిస్తున్న వేదపండితుడు

చంపాపేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కర్మన్ ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానాన్ని మంగళవారం రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్(డీజీ)డాక్టర్ సౌమ్యామిశ్రా కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన డీజీకి ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని వినాయకుడు ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో డీజీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీజీకి ఆలయ పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందించారు. డీజీకి ఆలయ ఇన్‌చార్జి ఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి


టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఉమేష్ గౌడ్

వనస్థలిపురం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మరింత కష్టపడి పని చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమేష్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఉమేష్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమేష్ గౌడ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలచుకోవడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి నుంచి స్వప్న తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్నను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌పై 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించిన అనంతరం ఈ నెల 13న తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస బలపరీక్ష ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ బలపరీక్షలో చైర్మన్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఆర్డీఓ నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో చైర్‌పర్సన్ స్వప్నను పదవి నుంచి తొలగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి చైర్మన్ ఎన్నిక జరిగే వరకు వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

నేడు, రేపు మానసిక దివ్యాంగులకు ఉచిత పరికరాల పంపిణీకి అర్హత పరీక్ష

వనస్థలిపురం, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీలోని శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఈనెల 25 నుంచి 26 (బుధ, గురువారం) వరకు సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఉచిత పరికరాల పంపిణీకి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు సి.రమేష్ తెలిపారు. మానసిక దివ్యాంగ విద్యార్థులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, మానసిక దివ్యాంగ విద్యార్థులు ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా అయ్యేందుకు వారికి భారత ప్రభుత్వం ఉచితంగా పరికరాలను అందజేస్తోందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9246913303ను సంప్రదించాలని ఆయన కోరారు.

బాలాపూర్ గణేశ్ లడ్డూ ప్రసాదం పంపిణీ ప్రారంభం

● పలు విభాగాల అధికారులకు అందజేసిన శంకర్‌రెడ్డి


ప్రసాదం పంపిణీని ప్రారంభిస్తున్న శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): వేలంలో రూ.30 లక్షలకు బాలాపూర్ లడ్డూ ప్రసాదం సొంతం చేసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి సదరు ప్రసాదం పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ముందుగా బాలాపూర్ రెవెన్యూ, బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులతో పాటు మీర్‌పేట, బాలాపూర్, పహాడీషరీఫ్ పీఎస్‌లకు చెందిన అధికారులకు, మీడియా ప్రతినిధులకు ప్రసాదం అందజేశారు. అనంతరం బాలాపూర్‌లోని తన నివాసంలో స్థానిక భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ, లడ్డూ ప్రసాదం కావాలంటూ హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఫోన్ చేస్తున్నారని, వారందరికీ ప్రసాదం అందేలా చూస్తానని అన్నారు. బాలాపూర్‌లోని ప్రతి గడపకూ ప్రసాదం ఇవ్వాలన్నదని తన ఉద్దేశమని, పొరపాటున ఎవరికైనా ప్రసాదం అందకపోతే తన నివాసానికి వచ్చి తీసుకోవాలని ఆయన కోరారు.

బాలాపూర్ గణేశ్ హుండీ ఆదాయం రూ.18 లక్షలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన బడా వినాయకుడి లడ్డూ ప్రసాదం వేలంలో రూ.30లక్షలు ధర పలుకగా.. విఘ్నేశ్వరుడి మండపంలోని హుండీ ఆదాయం రూ.18 లక్షలుగా తేలింది. మంగళవారం ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీని లెక్కించగా మొత్తం రూ.18.06 లక్షలుగా లెక్క తేలింది. ఈ మొత్తాన్ని ఉత్సవ సమితి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసి, అవసరాన్ని బట్టి ఖర్చు చేస్తామని నిరంజన్‌రెడ్డి తెలిపారు.


పోలీసు అధికారులు, సిబ్బందిని సన్మానిస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు

పోలీసు అధికారులకు సన్మానం

నవరాత్రి మహోత్సవాలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన బాలాపూర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భూపతి, డీఐ మధుతో పాటు ఎస్సైలు, ఇతర సిబ్బందిని మంగళవారం పీఎస్‌లో కలిసి ఘనంగా సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, ఉత్సవాలకు సహకరించిన డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు, మునిసిపల్, ట్రాన్స్‌కో తదితర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.


మహేశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తీగల

టీపీసీసీ అధ్యక్షుడికి తీగల శుభాకాంక్షలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మీర్‌పేట మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, నాయకులు కుంచె నాగేందర్‌గౌడ్, ప్రమోద్, ఎరుకల రవిగౌడ్, సిద్దాల బాలప్ప, పెండ్యాల సత్యనారాయణ, రామిడి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలు దంచికొట్టిన వాన

● వరదల్లో చిక్కుకున్న నాగోల్‌లోని ఆనంద్‌నగర్
● జలదిగ్బంధంలో పలు కాలనీలు
● పలు చోట్ల స్తంభించిన ట్రాఫిక్


నాగోల్ చౌరస్తాలో చేరిన వరదనీరు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): సుమారు రెండు గంటల పాటు మంగళవారం సాయంత్రం ఆగకుండా కురిసిన భారీ వర్షానికి ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, ప్రధాన రోడ్లు తడిసి ముద్దయ్యాయి. పలు ప్రాంతాలు మాత్రం జలదిగ్బంధంలో చిక్కుకోగా.. పలు చోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ, ఆనంద్‌నగర్‌లోని పలు కాలనీల్లో మోకాళ్లలోతు వరదనీరు చేరగా ఆయా ప్రాంతాల ప్రజలు బయటకు రాలేని దుస్థితి తలెత్తడంతో ఆయా ప్రాంతాల వారు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ నుంచి ఉప్పల్‌కు వెళ్లే ప్రధానరోడ్డుకు అనుసంధానంగా ఉన్న నాగోల్ చౌరస్తాతో పాటు సాయినగర్ రోడ్ నంబర్ 3, 4లలో భారీగా వర్షపునీరు రావడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారికి రాకపోకల్లో అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు సైతం వరదనీటిలో చిక్కుకున్నాయి.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. హైకోర్టు, జింకల పార్కు పరిసరా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు భాగ్యలత బీడీఎల్ కాలనీ మీదుగా రావడంతో అరుణోదయకాలనీ, రాఘవేంద్రకాలనీ రోడ్లపై నీరు చేరింది. వరద ఫైర్ స్టేషన్ చేరుకుని స్టేషన్ ముందు భాగం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్, ఫైర్ స్టేషన్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలం చేరుకుంది. దీంతో ఆ ప్రాంతం చెరువును తలపించింది. విజయవాడ జాతీయ రహదారిపై పుల్లారెడ్డి స్వీట్‌హౌస్ ముందు భారీగా వరద నీరు చేరింది. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. కొంత సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.


ఆనంద్‌నగర్ శ్రావణ్‌శ్రీ ఎల్‌క్లేవ్ వద్ద మోకాళ్లలోతు నిలిచిన వరద


నాగోల్ చౌరస్తా బండ్లగూడ వెళ్లే మార్గంలో స్తంభించిన ట్రాఫిక్


ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్ మధ్యలో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం


రాఘవేంద్రనగర్‌లో జలమయమైన రోడ్లు

ఎన్జీఓస్ కాలనీ బస్టాండ్‌లో శాంతిభద్రతలను పరిరక్షించండి


ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీఓస్ కాలనీవాసులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్జీఓస్ కాలనీ బస్టాండ్‌లో శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరుతూ ఎన్జీఓస్ కాలనీవాసులు వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేముల జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్జీఓస్ కాలనీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళలో మద్యం తాగుతూ, ఇతరులతో గొడవలకు దిగుతున్నారని, అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వేలాది కుటుంబాలు జీవిస్తున్న ఎన్జీఓస్ కాలనీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాలనీవాసులకు ఆకతాయిల నుంచి ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా చట్టపరమైన చర్యలు చేపడతటామని ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారని కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు స్వామిరాయ్, రాఘవ నాయుడు, చక్రవర్తుల శ్యామ్, శ్రీనివాస్, కాలేబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి: ఇద్దరి అరెస్టు

కొత్తపేట, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై ఎల్బీనగర్ పోలీసుల దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గజ్వేల్‌కు చెందిన రావిశెట్టి దయాకర్(35) 3 నెలల క్రితం నగరానికి వచ్చాడు. మన్సూరాబాద్ హిమపురి కాలనీలో ఉంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న ఇతను ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో తాను ఉంటున్న అద్దె ఇంట్లోనే వ్యభిచారం నిర్వహించడం మొదలు పెట్టాడు. సమాచారం అందుకున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారులు, ఎల్బీనగర్ పోలీసులు సోమవారం రాత్రి సదరు వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకుడు రావిశెట్టి దయాకర్‌తో పాటు ఉప్పల్‌కు చెందిన విటుడు సుదర్శన్ హరిని అరెస్టు చేశారు. ఓ మహిళను అదుపులోకి తీసుకొని రెస్క్యూ హోమ్‌కు తరలించారు. నిందితులను మంగళవారం రిమాండ్ తరలించారు.

భర్తతో తగాదా.. భార్య అదృశ్యం


శారద

మన్సూరాబాద్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): భర్త మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి మహిళ అదృశ్యమైన ఘటన నాగోల్ ఠాణా పరిధిలో జరిగింది. చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ నాగోల్ డివిజన్ సాయినగర్‌లో గుర్రం ప్రతాప్‌రెడ్డి, భార్య శారద(32)తో కలిసి ఉంటున్నాడు. వివాహం జరిగి మూడేళ్లైనా వారికి సంతానం కలుగలేదు. కాగా ఈ నెల 11న రాత్రి 11గంటలైనా ఇంటికి రాకపోవడంతో శారద భర్తకు ఫోన్ చేసి ఇంటికి ఇంకా ఎందుకు రాలేదని అడగ్గా వారిద్దరి మధ్య గొడవైంది. కొద్దిసేపటి తర్వాత ప్రతాప్‌రెడ్డి ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. చుట్టు పక్కల వారిని, బంధువులను ఆరా తీయగా ఆమె ఆచూకీ లభించలేదు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

● పోలీసులకు కేఎల్‌ఎం క్వీన్స్ హెచ్‌ఎం ఫిర్యాదు

సైదాబాద్, సెప్టెంబర్24(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ కాలనీలోని కేఎల్‌ఎం క్విన్స్ స్కూల్‌లో మత ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులు సోమవారం అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఐఎల్ మేరీ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 3న మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా జమాతే ఇస్లామీ సంస్థ మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై సైదాబాద్‌లోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం పరిధిలోని స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు. తమ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు పోటీలకు హాజరు కాగా, ఈనెల 12న సర్టిఫికెట్లు అందజేశారన్నారు. కాగా, సోమవారం కొందరు వ్యక్తులు స్కూల్‌లోకి బలవంతంగా ప్రవేశించి స్కూల్ మేనేజ్‌మెంట్ ఇస్లామిక్ మతంపై క్విజ్ పోటీ నిర్వహించారని, విద్యార్థులను ఉగ్రవాదులుగా తయారుచేసి నిధులు పొందారని ఆరోపిస్తూ స్కూల్ ఫర్నీచర్, కిటికీలు, నీటి కుండలు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ప్రిన్సిపాల్ కోరారు.

స్కూల్‌పై విద్యార్థి తండ్రి ఫిర్యాదు..

జమాతే ఇస్లామీ నిషేధిత సంస్థ అని, ఆ సంస్థ ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలకు విద్యార్థులను పంపిన స్కూల్‌పై కేసు నమోదు చేయాలని సైదాబాద్ పీఎస్‌లో తండ్రి వెంకటేశ్వర్ రావు ఫిర్యాదు చేశారు. విద్యార్థులను టోపీ, కళ్లకు సుర్మా పెట్టుకోవాలని ప్రోత్సహించడం ఎంత వరకు సమంజమని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులకు బలవంతంగా అన్యమత ప్రచారం చేస్తున్న స్కూల్‌పై కేసులు నమోదు చేయాలని కోరారు.

బాలికపై లైంగికదాడికి యత్నం కేసులో.. నిందితుడికి ఐదేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితునికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ. 12,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.కె. పద్మావతి మంగళవారం తీర్పు వెల్లడించారు. పీపీ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలిక (13) తాను పనిచేస్తున్న ప్రాంతానికి కూలీ డబ్బుల కోసం వెళ్లింది. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రోడ్డుమీద ఒంటరిగా ఉన్న బాలికను అటుగా వచ్చిన ఆటోడ్రైవర్ భీమనపల్లి రాజు (23) చూశాడు. బాలికతో మాటకలిపి ఆమె చెయిపట్టుకొని నిర్బంధించి లైంగిక దాడికి యత్నించాడు. వెంటనే బాలిక భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు విని అక్కడికి చేరుకునేలోపు వారు నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. అనంతరం సాక్ష్యాధారాలతో చార్జిషీట్ ఫైల్ చేసి కోర్టుకు సమర్పించారు. కేసు మంగళవారం విచారణకు రాగా.. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితునికి ఐదేళ్ల కఠినకారాగార శిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు. బాధితురాలికి రూ. 2లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డీఎల్‌ఏ (జిల్లా లీగల్ సెల్ అథారిటీ)ని ఆదేశించారు.

సహకార సంఘం లాభాల్లో 25 శాతం వాటా రైతులకు ఇవ్వాలి

● ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 25 వేల ఇళ్లు కట్టిస్తాం ● హైడ్రాకు మద్దతు ఇవ్వాలి: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చైర్మన్ సత్తయ్య

హయత్‌నగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘానికి వచ్చిన లాభాల్లో 25 శాతం వాటా రైతులకు ఇవ్వాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గాన్ని కోరారు. సోమవారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగిన 51వ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం రూ. 4 కోట్ల లాభాల్లో ఉండటం గర్వించదగ్గ విషయమని పాలకవర్గాన్ని అభినందించారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం రాష్ట్రంలోనే రైతులకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నదని అన్నారు. సంఘం ఆర్జించిన లాభాల్లో రైతులకు ఏదో రకంగా 25 శాతం వాటా అందేలా పాలక వర్గం కృషి చేయాలని కోరారు. రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, అందు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు రూ. 18 వేల కోట్ల రుణ మాఫీ చేశారన్నారు. గత ప్రభుత్వం అర చేతిలో వైకుంఠం చూపించి ప్రజల నెత్తిన రూ. 7వేల కోట్ల అప్పు భారం పెట్టి పోయిందని విమర్శించారు. నియోజకవర్గంలో 25 వేల ఇళ్లు కట్టిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పేరుతో తుర్కయంజాల్ పరిసర గ్రామాల్లో ప్రభుత్వ భూములను అమ్ముకున్నారని అన్నారు. మాసబ్ చెరువు మధ్య రోడ్డు వేసినా పట్టించుకోలేదని అన్నారు. సమాజంలో చెరువులు ఎంతో అవసరం అని అందుకే ప్రజలందరూ హైడ్రాకు సహకరించాలని కోరారు. తుర్కయంజాల్ పరిసర ప్రాంతంలో డీసీసీబీ బ్యాంకు భవనం కోసం ఒక ఎకరం భూమిని కేటాయించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని అన్నారు. చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ రైతులు, అధికారుల సహకారంతో సంఘం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. చనిపోయిన రైతు కుటుంబానికి రూ. 25 వేలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, వంగేటి లక్ష్మారెడ్డి, స్వప్న, యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డితో పాటు కౌన్సిలర్‌లు కొశిక ఐలయ్య, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, సునీల్‌తో పాటు నాయకులు శేఖర్‌గౌడ్, సామ భీంరెడ్డి, కుంట గోపాల్‌రెడ్డి, కందాడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలు చేయించాలి

● బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి


ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ బూత్‌లో కనీసం 2వందల మందితో బీజేపీ సభ్యత్వం నమోదు చేయించాలని పార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముసారాంబాగ్ డివిజన్ సలీంనగర్‌లోని బూత్ నంబర్ 226లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో 200 మంది పార్టీ సభ్యత్వం తీసుకొనేలా ఇంటింటికీ వెళ్లాలని బూత్ కమిటీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడంతో పాటు హర్ ఘర్ మే బీజేపీ నినాదంతో ప్రతి ఇంట్లో వారిని పార్టీ సభ్యత్వం తీసుకొనేలా చూడాలన్నారు. పోలింగ్ బూత్ నంబర్ 226లో బుధ వా రంతో బీజేపీ సభ్యత్వ నమోదు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మం, నాయకులు వెంకటేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

'గ్లోబల్ మైండ్స్' విద్యార్థులకు కరాటేలో బంగారు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హయత్‌నగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో ఓపెన్ నేషనల్ మార్షల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈగల్ కప్ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలలో ఇంజాపూర్‌లోని గ్లోబల్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఆరవ తరగతి చదువుతున్న వికాస్, అనన్యలు బంగారు పతకాలు సాధించగా దీపిక, అమూల్య, పావని కాంస్య, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాని శ్రీనివాస్, అకాడమీ డైరెక్టర్ విజయ సారథి, వైస్ ప్రిన్సిపల్ మమత, కరాటే కోచ్ జితేంద్రకుమార్‌లు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

పరిశుభ్రతలో మావ్లిన్నాంగ్ గ్రామం అందరికీ ఆదర్శం


మావ్లిన్నాంగ్ పర్యటనలో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

కొత్తపేట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అత్యుత్తమ పరిశుభ్ర గ్రామంగా గుర్తింపు పొందిన మావ్లిన్నాంగ్ అందరికీ ఆదర్శమని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. జీహెచ్ఎంసీ స్టడీ టూర్‌లో భాగంగా మేఘాలయలోని అత్యుత్తమ పరిశుభ్ర గ్రామం మావ్లిన్నాంగ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పారిశుధ్యం విషయంలో ఆ గ్రామ ప్రజల భాగస్వామ్యం ఆకట్టుకుందన్నారు. ప్లాస్టిక్ వాడకంతో పాటు పొగతాగడంపైనా ప్రజలే స్వచ్ఛందంగా నిషేధం విధించుకున్నారని పవన్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన చెట్ల సజీవ వేర్లతోనే వంతెనలు ఉన్నాయన్నారు. వ్యర్థాలను వెదురు బుట్టల్లో సేకరించడంతో పాటు స్వచ్ఛందంగా అందరూ చెట్ల నుంచి రాలిన ఎండుటాకులను వ్యర్థాలను సేకరించి వాటిని ఎరువుగా తయారు చేసుకుంటున్నారని తెలిపారు. పర్యాటకులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు గ్రామంలో సూచికలు ఏర్పాటు చేశారని కార్పొరేటర్ తెలిపారు.

సాయినగర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య బృందం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట కార్పొరేషన్ 1వ డివిజన్‌లోని సాయినగర్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల వ్యాప్తి.. దాని వల్ల ప్రబలే రోగాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాపించే ప్రమాదమున్నందున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతకు కట్టుబడి ఉంటామంటూ అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ స్నిత్, డాక్టర్ గాయత్రి, హెల్త్ సూపర్‌వైజర్ రాజేందర్, ఎంపీహెచ్ పర్వీన్ బేగం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, జవాన్ జగదీశ్ పాల్గొన్నారు.


లేఅవుట్‌లో ఇరువర్గాలు దాడి చేసుకుంటున్న దృశ్యం


గాయపడ్డ రైతు


గాయపడ్డ సూపర్‌వైజర్

భూ వివాదంలో ఇరు వర్గాల ఘర్షణ

● రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు
● ఇరువురు వర్గాల వారికి గాయాలు.. పోలీసులకు ఫిర్యాదు
● ఎస్సీ, ఎస్టీతో పాటు పలు సెక్షన్లలో కేసులు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య జరిగిన వాగ్వాదం కాస్తా.. ఒకరిపై మరొకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిగ్లీపూర్ గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17/1లో సుమారు 27 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ అనుమతితో కొంత కాలంగా లేఅవుట్ చేస్తున్నారు. లేఅవుట్ పనులు జరుగుతున్న 17 సర్వే నంబర్‌లోనే గతంలో ప్రభుత్వం తమకు సీలింగ్ పట్టాలను ఇచ్చిందని గ్రామానికి చెందిన పులువురు రైతులు మంగళవారం అక్కడి చేరుకున్నారు. డోజర్‌తో లేఅవుట్‌లోని రోడ్డును చదును చేయించారు. దాంతో అక్కడే ఉన్న లేఅవుట్ సూపర్ వైజర్‌తో పాటు సిబ్బంది రోడ్డును ధ్వంసం చేయొద్దని వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల తీవ్ర వాగ్వాదం జరిగి.. అది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో లేఅవుట్ సూపర్‌వైజర్ లోకేష్‌తో పాటు సిబ్బందికి గాయాలు కాగా.. రైతులు ముత్తయ్య, నర్సింహ, సత్యనారాయణ, శంకర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీతో పాటు పలు సెక్షన్లపై కేసులు నమోదు చేశారు.

దౌర్జన్యంగా దాడి చేశారు: రైతులు

సదరు సర్వే నంబర్‌లో తమకు చెందిన సీలింగ్ భూములు ఉన్నాయని, వాటిని దున్నేందుకు వెళ్లాం. లేఅవుట్ చేస్తున్నవారు దౌర్జన్యంగా తమపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కావాలనే ఇబ్బంది పెడుతున్నారు: లేఅవుట్ నిర్వాహకులు

హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకుని లేఅవుట్ చేస్తున్నాం. రెండేళ్లుగా పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు అక్కడ సీలింగ్ భూమి ఉందంటూ కొందరు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మంగళవారం డోజర్‌తో వచ్చి రోడ్డును ధ్వంసం చేసి మా సూపర్ వైజర్‌తో పాటు సిబ్బందిపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.